క్లుప్తంగా

పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వాలి

తల్లాడ: తల్లాడ సొసైటీలో రైతులందరికీ పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయడంలేదని మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపించారు. గురువారం అన్నారుగూడెం రైతులు విలేఖర్లతో మాట్లాడుతూ.. బుధవారం నాడు పచ్చిరొట్ట విత్తనాల కోసం తల్లాడ సొసైటీ కార్యాలయానికి వెళ్లగా.. సీఈఓ, సిబ్బంది విత్తనాలు అయిపోయాయని తెలిపారన్నారు. రైతులకు అనుమానం వచ్చి గోడౌన్‌లోకి వెళ్లి చూడగా పిల్లి పెసర బస్తాలు కన్పించడంతో.. రైతులు సొసైటీ సిబ్బందిని అడగ్గా.. వారు అవి ముఠా వాళ్లు ఉంచినట్లు తెలిపారన్నారు. ఈ విషయమై సొసైటీ సీఈఓ నాగబాబును వివరణ కోరగా.. తల్లాడ సొసైటీకి 220 బస్తాలు పిల్లిపెసలు, 830 బస్తాలు జీలుగులు వచ్చాయని వాటిని అర్హులైన రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కేవలం పది బస్తాలు పొలం ఉన్న ముఠా వాళ్లు పక్కన ఉంచారని, అవి కూడా ఆన్‌లైన్ చేసిన రైతులకే పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొణిజర్ల: ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరుతో ఫీజుల దోపిడీ చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కొణిజర్ల తహసీల్దార్ తఫజల్ హుస్సేన్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లు నిరుపేదలకు ఇవ్వాలన్న ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదన్నారు. బడులు తెరిచే నాటికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పుప్పాల నాగరాజు, రామిశెట్టి ఉపేందర్, సాయి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

ముదిగొండ: నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని యడవల్లిలక్ష్మీపురానికి చెందిన దళిత కుటుంబాలు తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. యడవల్లి రెవెన్యూ పరిధిలోని భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని, ఆ భూముల్లో పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని వారు వినతిపత్రంలో కోరారు. యడవల్లి రెవెన్యూ పరిధిలోని భూమిలో గుర్తుతెలియని వ్యక్తులు వివిధ పార్టీలకు చెందిన జెండాలను పాతారు. తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భూములను పరిశీలించి సర్వే నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు విఠల్‌రావు

పెనుబల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను ఎండకట్టాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. గురువారం పెనుబల్లిలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్స వేడుకలు ఘనంగా నిర్వహించి.. జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటం సాగిస్తుందని.. భవిష్యత్‌లో అనేక ఉద్యమాల నిర్మాణంలో భాగస్వామ్యంగా మునుముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాయం తిరుపతిరావు, టి.చిరంజీవి, ఎం.నాగమణి, మిద్దె స్వామి, రాములు, బుడ్డియ్య, కడియం రాజు, వేముల చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

తల్లాడ: మండలంలోని రామానుజవరం గ్రామ పంచాయతీ జిల్లాలోనే ఉత్తమ పంచాయతీగా ఎంపిక కావడంతో గత ఐదేళ్లుగా పనిచేసి అభివృద్ధి చేసిన తాజా మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, సతీమణి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలైన శీలం శివపార్వతిని గురువారం పలువురు అభినందించారు. పచ్చదనం పరిశుభ్రతలో వివిధ అభివృద్ధి పనుల్లో వారు అగ్రగామిగా నిలిచారన్నారు. అభినందించిన వారిలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, ఎంపీడీఓ చంద్రమౌళి, తల్లాడ, కుర్నవల్లి సొసైటీల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, అయిలూరి ప్రదీప్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

నిర్లక్ష్యం వీడేదెన్నడు..?

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- రక్షణ కవచాలు లేని వైనం
- ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా.. ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎక్కువ శాతం జనావసరాలు, రహదారుల వెంబడి, పాఠశాలల సమీపంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్లు అతి తక్కువ ఎత్తులో ఎలాంటి రక్షణ కవచాలు లేకుండా ఉండడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాద సంఘటనలు జరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.



వైరా రిజర్వాయర్‌కు వెళ్లే మార్గంలో విద్యుదాఘాతంతో మృతిచెందిన గేదెలు(ఫైల్)



కేజీ సిరిపురంలో రహదారి పక్కనే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వైరారూరల్: మండల పరిధిలోని కేజీ సిరిపురంతో పాటు పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు రహదారుల వెంబడి ఎటువంటి రక్షణ కవచాలు లేకుండానే దర్శనమిస్తున్నాయి. వాహనదారులు ఈ దారుల వెంబడి రాకపోకలు సాగిస్తున్న నేపథ్యాన ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరించిన పెనుప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా పల్లెలతో పాటు పట్టణ కేంద్రంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్లు రక్షణ వలయాలు లేకుండా ఉన్నాయి. ఏళ్లుగా ఇలాగే ఉన్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వ్యవసాయ పొలాల వద్ద..

మండలంలోని పలు గ్రామాల్లో గల వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదాలు పెరిగినా పట్టించుకునే వారు లేకుండా పోయారు. చాలా చోట్ల పొదల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లు మూసుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు.

నిర్లక్ష్యానికి మూగ జీవాల ప్రాణాలు బలి..

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి మూగ జీవాల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. వ్యవసాయ పొలాలు, రహదారుల వెంబడి తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో మూగజీవాలు మేత కోసం వాటి వద్దకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఈ క్రమంలో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయినా.. అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మచ్చుకు కొన్ని ప్రమాదాలు..

- ఇటీవల వైరా మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకనగర్‌కు చెందిన పాడి రైతు తన రెండు గేదెలను మేత కోసం వైరా రిజర్వాయర్ వైపు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెలకు ఎర్త్ వైర్లు తగిలి మృతి చెందాయి. దీంతో బాధిత రైతుకు సుమారు 1.50 లక్షల నష్టం వాటిల్లింది.
- కొణిజర్ల మండలం పెద్ద గోపతి గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు మేత మేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. బాధిత రైతుకు సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లింది.
- ఇలా ఒక్క విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దనే కాకుండా పలు ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగాలు తెగిపడి మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్నా.. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు.

నిర్లక్ష్యం వీడాలి..



విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెన్సింగ్ వైర్లతో రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి. ఫెన్సింగ్ లేకపోవడంతో మూగ జీవాలు మేతకు వెళ్లి విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోతున్నయి. దీంతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

– అల్లిక కాటంరాజు, ఎంపీటీసీ, తాటిపూడి

రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి..



రహదారుల పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరుకు ఎటువంటి రక్షణ కవచాలు లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డుపై రోజూ వాహనదారులు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి.

– సాగినేని నాగేశ్వరరావు, కేజీ సిరిపురం

డీలర్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న నర్సింహారావు

సత్తుపల్లిరూరల్: మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్‌లు తీసుకొని వ్యాపారం నిర్వహిస్తున్న విత్తన, పురుగుమందులు, ఎరువుల డీలర్లు ప్రభుత్వం విధించిన నిమనిబంధనల ప్రకారం మాత్రమే వ్యాపారం నిర్వహించాలని సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుడు యు.నర్సింహారావు తెలిపారు. గురువారం కొత్తూరు రైతు వేదికలో విత్తన, పురుగుమందులు, ఎరువులు డీలర్లతో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ సీఐ టి.కిరణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీజీ–3, గ్లైఫోసెట్ విక్రయాలపై నిషేధం విధించిందని ఎవరు కూడా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాపార కార్యకలపాలు నిర్వహించవద్దని, లేనిచో చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావు, ఏఈఓ టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన డీలర్లతో సమావేశం..



మాట్లాడుతున్న మధిర ఏడీఏ వెంకటేశ్వరరావు

చింతకాని: నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవటం జరుగుతుందని మధిర ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో విత్తన, ఎరువుల డీలర్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలపై వ్యవసాయశాఖ, పోలీస్, టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారుల బృందం నిరంతరం పర్యవేక్షణ జరుగుతుందన్నారు. డీలర్లు నకిలీ విత్తనాలు విక్రయిస్తే.. చట్టరీత్యా చర్యలు తీసుకోవటంతో పాటు లైసెన్స్‌ను రద్దు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య, ఎస్సై నాగుల్‌మీరా, విత్తన, ఎరువుల డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మట్టితో రైతులకు లాభాలు



పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: చెరువులోని ఒండ్రు మట్టి పొలాలకు తోలుకోవడం వల్ల రైతులు భూసారం పెంచుకోవచ్చని తద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించ వచ్చని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ అన్నారు. గురువారం మండలంలోని పెద్దగోపతి ఊర చెరువులో ఉపాధి కూలీలు తవ్వుతున్న మట్టిని రైతులు పొలాలకు తోలకుంటుండగా ఆయన పరిశీలించి ఉపాధి కూలీలు, రైతులతో మాట్లాడారు. చెరువు మట్టిలో రైతులకు ఉపయోగపడే సేంద్రీయకార్బన్, సూక్ష్మ జీవులు ఉంటాయన్నారు. చెరువు మట్టి పై అవగాహన లేక చాలా మంది రైతులు చెరువుమట్టి పొలాల్లో చల్లుకోవడం లేదన్నారు. రైతులు ఎకరానికి 20 నుంచి 25 ట్రాక్టర్ల చెరువు మట్టి తోలుకుంటే నాలుగేళ్ల వరకు పంటలకు రక్షణగా ఉంటుందన్నారు. చెరువులో మట్టి 2.5 అడుగులకు మించి తవ్వితే అందులో మట్టి తప్ప పోషకాలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రహదారి అధ్వానం

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారి కంకర తేలి అధ్వానంగా ఉంది. ఏళ్ల తరబడి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు, గుంతలు పడి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో పంట పొలాలకు రైతులు వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. ఇక వాన కాలం వస్తే నానా రకాలుగా అటు వెళ్లే వారు ఇబ్బందులకు గురౌతున్నారు. అవసరం లేని చోట సీసీ రోడ్లకు పంచాయతీ రాజ్, ప్రత్యేక అధికారులు మంజూరు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇకనైనా అధికారులు శ్మశాన వాటిక రోడ్లకు నిధులు మంజూరుచేసి మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన శ్మశాన వాటిక రహదారి


ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



సీతారాముల దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

ఏన్కూరు: మండల కేంద్రంలోని సీతారాముల దేవస్థానాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, బి శేషయ్య, ఇవూరి సైదులు, మైసారావు పాల్గొన్నారు.

దివ్యాంగుల సేవాసదనంలో అన్నదానం..



అన్నదానం చేస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల సేవాసదనంలో గురువారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. నీలం భారతమ్మ తృతీయ వర్ధంతి సందర్భంగా కుమారుడు రమేష్ బాబు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

ముదిగొండ: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీఐటీయూ మండల కన్వీనర్ కల్యాణ్ అన్నారు. ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో గ్రానైట్ కార్మికులు సీఐటియూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాపాడటం కోసం కార్మికుల పక్షాన నిలబడి సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో తేరాల నాగేశ్వరరావు, బంకా ఉపేందర్, వెంకన్న, రాజు, లింగయ్యలు పాల్గొన్నారు.

1న హనుమాన్ శోభాయాత్ర

తల్లాడ: జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని నారాయణపురం నుంచి అంజనాపురం ఆంజనేయ దేవాలయం వరకు నాలుగు కిలోమీటర్లు హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శోభాయాత్ర నారాయణపురం కోదండ రామాలయం నుంచి తల్లాడ రింగ్ రోడ్డు మీదుగా అంజనాపురం ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తల్లాడ, నారాయణపురం పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

కల్యాణం.. కమనీయం



స్వామి కల్యాణం జరుపుతున్న వేద పండితులు

- కనుల పండువగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణం
- భక్తుల నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం
- భారీగా హాజరైన భక్తులు

కారేపల్లి: మండలంలోని తోడితలగూడెం గ్రామ శివారులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో స్వామి కల్యాణ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా వైశాఖ మాస బహుళ సప్తమిన స్వామి కల్యాణం జరుపుతుంటారు. దేవాలయంలో ఉదయం నుంచే సుప్రభాత సేవ, స్వామి అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి ప్రజ్వలనం, స్వామి కల్యాణస్నానం, లక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం వంటి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. నవీన్ ఆధ్వర్యాన వేద పండితులు మంత్రోచ్చరణ మధ్య అంబటి కృష్ణ–రాజ్యం పుణ్య దంపతుల చేతుల మీదుగా స్వామి కల్యాణతంతు జరిపారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టూ పక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన మహా అన్నదానం చేశారు. కల్యాణానికి ఇల్లెందు మున్సిపాలటీ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజారాం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వైరారూరల్: మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు భక్తులు పీఠాల మీద కూర్చొని స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

వైరా: వైరాలోని షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గోమాతకు పూజలు నిర్వహించిన అనంతరం యాగశాలలో హోమాలు జరిపారు. అలాగే ఆలయంలో మూడు రోజుల పాటు యాగ పూజలు, హోమాలు జరపనున్నట్లు నిర్వాహకులు రంగుబట్ల రాజశేఖర్ శర్మ తెలిపారు. ఈ ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

ఎర్రుపాలెం మండలంలో..



సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో సాయినాథుడికి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. బాబాకి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేసి కర్పూర హారతులిచ్చారు. భక్తులు శ్రీసాయిబాబా వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు భజనలు చేస్తూ సాయి గీతాలను ఆలపించారు. మండలకేంద్రంలోని ఆలయంలో బనిగండ్లపాడు గ్రామానికి చెందిన శీలం రామలింగారెడ్డి–చంద్రకళ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాయి మందిరాల్లో అన్నదానాలు



అన్నదానం చేస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీషిర్డిసాయి మందిర్, రాజీవ్‌నగర్ శ్రీవిజయసాయి ధ్యానమందిరం, కాకర్లపల్లి సాయిబాబా, కొత్తూరు సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డిసాయి మందిరంలో జి.రామాంజనేయప్రసాద్, వనజ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలలో మొరిశెట్టి సాంబశివరావు, గుండు ఉమామహేశ్వరరావు, మోరంపూడి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, దివ్య, సురేష్, శారద, తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్‌లైన్ పనులు ప్రారంభం

ముదిగొండ: పమ్మి 132/33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కమలాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 33కేవీ విద్యుత్ కొత్తలైన్ నిర్మాణ పనులను విద్యుత్ శాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. రూ. 23.13లక్షల వ్యయంతో 4.9కి.మీ విద్యుత్ కొత్తలైన్ నిర్మాణం చేపడతున్నారు. ఈ లైన్ నిర్మాణంతో కమలాపురం, బాణాపురం, వల్లభి విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా మెరుగుపరచడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ఉపయోగపడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ డీఈ హీరాలాల్, కన్‌స్ట్రక్షన్ ఏడీఈ కిరణ్‌చక్రవర్తి, ముదిగొండ ఏడీఈ భీంసింగ్, కన్‌స్ట్రక్షన్ ఏఈ ప్రసాద్, పమ్మి విద్యుత్‌శాఖ ఏఈ నారాయణ, కె.రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



కమలాపురం సమీపంలో కొత్త విద్యుత్‌లైన్‌లు నిర్మాణం చేపడుతున్న సిబ్బంది

లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

మధిరరూరల్: మండలంలోని సిద్దినేని గూడెం గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను విద్యుత్ శాఖ అధికారులు గురువారం పరిష్కరించారు. ఆ గ్రామంలోని చెరువు సమీపంలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ నాగేశ్వరరావు, సీనియర్ లైన్‌మెన్ పరిమి సత్యనారాయణ, జూనియర్ లైన్‌మెన్ ఊటుకూరు నాగరాజు, జ్వాల కృష్ణ, ఎస్‌కె బాబు సాహెబ్, మణికంఠ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసిన సిబ్బంది

కమల్‌రాజ్ పరామర్శ..

చింతకాని: మండలంలోని నాగులవంచ రైల్వే కాలనీ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కోపూరి నాగార్జున్ కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా నాగార్జున్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, వైస్ ఎంపీపీ హనుమంతురావు, నాయకులు రమేష్, లచ్చయ్య, గ్రామ మాజీసర్పంచ్ యలమంద తదితరులు పాల్గొన్నారు.